

RNI No: APTEL/2018/76747

# నవతరం

తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | సోమవారం | సంపుటి: 9 | సంచిక: 235 | పేజీలు: 04 | వెల: 5 /- | 24 ఆగస్టు 2026 |


# ప్రభుత్వంతో చర్చలు సఫలం..

## తెలంగాణలో ఆటో, క్యాబ్ సమ్మె విరమణ

- తెలంగాణలో ఈ అర్ధరాత్రి నుంచి జరగాల్సిన ఆటో, క్యాబ్ సమ్మె విరమణ
- ప్రభుత్వంతో కార్మిక సంఘాల చర్చలు విజయవంతం
- డిమాండ్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూల హామీ
- సమ్మెను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన ఐక్య కార్యాచరణ కమిటీ
- ప్రయాణికులకు తప్పిన రవాణా కష్టాలు



హైదరాబాద్, నవతరం: తెలంగాణలో ఈ అర్ధరాత్రి నుంచి తలపెట్టిన ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల నిరవధిక సమ్మె విరమించుకున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జరిపిన చర్చలు ఫలించడంతో యూనియన్లు ఈ నిర్ణయం తీసుకున్నాయి. దీంతో రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా హైదరాబాద్ నగరవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆగస్టు 23 అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటోలు, క్యాబ్‌లు, స్కూల్ వ్యాన్‌లు నిలిపివేయాలని 'కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ' పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే స్పందించి యూనియన్ల నేతలను చర్చలకు ఆహ్వానించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన యూనియన్ల డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించారు.

ప్రధానంగా ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ఆయన అంగీకారం తెలిపినట్లు సమాచారం. ప్రభుత్వ హామీతో సంతృప్తి చెందిన యూనియన్ల నేతలు, సమ్మెను విరమించుకుంటున్నట్లు అధికారికంగా ప్రకటించారు. మంత్రితో చర్చలు సఫలం కావడంతో, యథావిధిగా ఆటోలు, క్యాబ్‌లు, ఇతర ప్రైవేట్ వాహనాలు రోడ్లెక్కనున్నాయి. దీంతో ప్రయాణికులకు రవాణా కష్టాలు తప్పినట్లయింది.

# మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ

## కేసులో కీలక అరెస్ట్

తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) సుమంత్ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. సుమంత్ వ్యక్తిగత డ్రైవర్‌ను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. తెల్లాపూర్‌లోని సుమంత్ నివాసం సమీపంలోనే అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

బోడుప్పల్‌కు చెందిన వ్యాపారి గొంగిడి హరికృష్ణ (36)పై దాడి చేసి, బెదిరింపులకు పాల్పడిన కేసులో సుమంత్‌తో పాటు ప్రశాంత్, రాము, కార్తీక్ అరుణ్ కుమార్ రెడ్డి, మహేందర్ రెడ్డిలపై పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు.

నిందితులు తనను రూ.10 కోట్లు డిమాండ్ చేశారని, ఆ నగదు ఇచ్చేందుకు నిరాకరించడంతో తనపై భౌతిక దాడికి పాల్పడ్డారని హరికృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ దాడిలో తన ఎడమ చేయి ఫ్రాక్చర్ అవ్వడమే కాకుండా ఇతర గాయాలయ్యాయని వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే తాజాగా సుమంత్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



# ఎలుకలు తినేశాయి!

## భర్తకు తెలియకుండా 8 ఏళ్లుగా పొదుపు.. రూ.12 లక్షలు

ఉత్తరప్రదేశ్‌లో ఓ వింత ఘటన వెలుగులోకి వచ్చింది. భర్తకు తెలియకుండా ఓ మహిళ ఎనిమిదేళ్లుగా కూడబెట్టిన లక్షల రూపాయల నగదు ఎలుకల పాలైంది. బంగారం కొనుగోలు చేద్దామని ఆశతో దాచుకున్న ఆ డబ్బు, చివరకు చిత్తుకాగితాలుగా మారడంతో ఆ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.

వివరాల్లోకి వెళితే, యూపీలోని గోండా జిల్లాకు చెందిన ఓ మహిళ, ఇంటి ఖర్చుల నుంచి కొద్దికొద్దిగా డబ్బు పక్కన పెడుతూ వచ్చింది. అలా సుమారు ఎనిమిదేళ్లలో రూ.12 లక్షల వరకు పొదుపు చేసింది. ఈ విషయం తన భర్తకు కూడా తెలియకుండా జాగ్రత్తపడింది. ఈ డబ్బును ఓ ట్రంకు పెట్టెలో భద్రపరిచింది.

ఇటీవల, ఆ డబ్బుతో బంగారం ఆభరణాలు కొనాలని నిర్ణయించుకుంది. దీంతో ఎంతో ఆశతో ట్రంకు పెట్టెను తెరిచింది. కానీ లోపల దృశ్యం చూసి ఆమెకు గుండె ఆగినంత పనైంది. కరెన్సీ నోట్ల కట్టలను ఎలుకలు ముక్కలు ముక్కలుగా కొరికి పడేశాయి. చాలా నోట్లు పూర్తిగా నాశనమయ్యాయి.

కుటుంబ సభ్యులు ఆ చిరిగిన నోట్ల మధ్యలోంచి పనికొచ్చేవాటిని వేరుచేసేందుకు ప్రయత్నించినా, పెద్ద మొత్తం నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో, ముఖ్యంగా ఎక్స్ లో వైరల్ అయింది. చిరిగిన నోట్ల కట్టలను చూసి నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో పెద్ద మొత్తంలో నగదు దాచుకోవడం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన తెలియజేస్తోంది. దొంగతనం, అగ్నిప్రమాదం, తేమ లేదా ఎలుకల వంటి వాటి వల్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, డబ్బును బ్యాంకు ఖాతాల్లో దాచుకోవడం సురక్షితమని ఈ ఉదంతం మరోసారి స్పష్టం చేసింది.



# నేడు ఏలూరు జిల్లాలో చంద్రబాబు పర్యటన..

## మొక్కజొన్న వంగడం ఆవిష్కరణ

- సోమవారం ఏలూరు జిల్లాలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు
- ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కలిసి కొత్త విత్తన రకం ఆవిష్కరణ
- దేశంలోనే తొలి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ మొక్కజొన్న వంగడం ఇదే
- ముసునూరులోని గోర్మే పాప్‌కార్నికా ప్లాంట్‌లో ఈ కార్యక్రమం
- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ఈ ప్రయోగం లక్ష్యం

ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు (ఆగస్టు 24) ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో కలిసి దేశంలోనే మొట్టమొదటి నాన్-జీఎంఓ (జన్యుపరంగా మార్పు చేయని) పాప్‌కార్న్ మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాన్ని ఆయన ఆవిష్కరిస్తారు. ఏలూరు జిల్లా ముసునూరులోని గోర్మే పాప్‌కార్నికా సంస్థ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరగనుంది.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలనే లక్ష్యంతో ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. రైతులు పండించిన పంటకు విలువ జోడించి, ప్రాసెసింగ్, బ్రాండింగ్‌తో మార్కెట్‌కు తరలించడం ద్వారా వారి ఆదాయం పెంచాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ క్రమంలో ముసునూరు వేదికగా జరగనున్న ఈ కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది.

గోర్మే పాప్‌కార్నికా సంస్థ ఆధ్వర్యంలో ఈ కొత్త వంగడాన్ని అభివృద్ధి చేశారు.

ప్రస్తుతం ఈ సంస్థ దేశవ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పాప్‌కార్న్ మొక్కజొన్నను సాగు చేస్తూ, వేలాది మంది రైతులతో భాగస్వామ్యం కలిగి ఉంది. ముసునూరులో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్, ఆసియాలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. దేశంలోని వేలాది సినిమా థియేటర్లకు పాప్‌కార్న్ సరఫరా చేయడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది.

సీఎం పర్యటన వివరాలు

సీఎం చంద్రబాబు సోమవారం ఉదయం 9:55 గంటలకు తన క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి, 10:15 గంటలకు ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చేరుకుంటారు. ఉదయం 10:45 గంటలకు గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతారు. అనంతరం ఉదయం 11 గంటలకు జరిగే హైబ్రిడ్ మొక్కజొన్న విత్తన ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగిశాక, మధ్యాహ్నం 1:20 గంటలకు తిరిగి రాష్ట్ర సచివాలయానికి చేరుకుంటారు.



# SCSC @20 లోగో ఆవిష్కరణ

## "ఎనేబ్లింగ్ ఎంటర్‌ప్రైజ్ – 2 దశాబ్దాల SCSC" స్మారక పుస్తకావిష్కరణ

హైదరాబాద్, ఆగస్టు 23(నవతరం): సైబరాబాద్ పోలీస్, పరిశ్రమ మరియు సమాజం మధ్య రెండు దశాబ్దాల విజయవంతమైన భాగస్వామ్యానికి గుర్తుగా, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (SCSC) తన 20వ వార్షికోత్సవాన్ని హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలోని అవసా హోటల్‌లో జరుపుకుంది. "రెండు దశాబ్దాల విశ్వసనీయ భాగస్వామ్యం, భద్రత & అభివృద్ధి వేడుక" అనే ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ పోలీస్ అధికారులు, ప్రభుత్వ ప్రతినిధులు, పరిశ్రమ నాయకులు, భద్రతా నిపుణులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, మీడియా మరియు సమాజ భాగస్వాములు హాజరయ్యారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సైబరాబాద్ ప్రాంతంలో తలెత్తుతున్న భద్రతా అవసరాలను పరిష్కరించడానికి పోలీస్, పరిశ్రమ మరియు సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో SCSC ఆగస్టు 23, 2006న అధికారికంగా స్థాపించబడింది. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్, మాట్లాడుతూ, ఐటీ నిపుణులు మరియు విస్తృత ఐటీ సమాజం యొక్క భద్రత, రక్షణ సైబరాబాద్ పోలీసులకు ఒక ముఖ్యమైన ప్రాధాన్యతగా ఉందని అన్నారు. గత రెండు దశాబ్దాలుగా పోలీసులకు నిరంతర మిగతా 2లో..

# హైడ్రా రి'యాక్షన్' షురూ..

## బాహుబలి జేసీబీతో గచ్చిబౌలిలో ప్రమాదకర భవనం కూల్చివేసిన హైడ్రా

- గచ్చిబౌలి ఆంజనేయ నగర్‌లో ప్రమాదకర భవనం కూల్చివేత
- నిన్న కూలిన భవనం పక్కనే దెబ్బతిన్న మరో నిర్మాణం
- సీఎంసీ, హైడ్రా ఆధ్వర్యంలో సంయుక్త ఆపరేషన్
- ముందుజాగ్రత్తగా సమీప అపార్ట్‌మెంట్ వాసుల తరలింపు
- అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించిన అధికారులు

**హైదరాబాద్, నవతరం:** రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ఆంజనేయ నగర్‌లో శనివారం ఓ ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన నేపథ్యంలో, దాని పక్కనే ప్రమాదకరంగా మారిన మరో బహుళ అంతస్తుల భవనాన్ని అధికారులు కూల్చివేశారు. సీఎంసీ (సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్), హైడ్రా బృందాలు సంయుక్తంగా ఆదివారం ఉదయం ఈ ఆపరేషన్ చేపట్టాయి.

శనివారం సాజిద్ అనే వ్యక్తికి చెందిన భవనం కూలిపోవడంతో, దాని శిథిలాలు పక్కనే ఉన్న మరో ఏడంతస్తుల భవనంపై పడ్డాయి. దీంతో ఆ భవనం కూడా తీవ్రంగా దెబ్బతిని, ఏ క్షణమైనా కూలిపోయే స్థితికి చేరింది. ఈ నిర్మాణం వల్ల చుట్టుపక్కల భవనాలకు, ప్రజలకు పెను ప్రమాదం పొంచి ఉందని సీఎంసీ అధికారులు నిర్ధారించారు. వారి అభ్యర్థన మేరకు హైడ్రా బృందాలు రంగంలోకి దిగి కూల్చివేత పనులను ప్రారంభించాయి.

ఈ భవనాలు అత్యంత సమీపంలో, ఎలాంటి ఖాళీ స్థలం లేకుండా నిర్మించడంతో కూల్చివేత సవాలుగా మారింది. 'బాహుబలి' జేసీబీ వంటి భారీ యంత్రాలను ఉపయోగిస్తూ, సమీపంలోని ఇతర నిర్మాణాలకు ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కూల్చివేత నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని స్టెర్లింగ్ వైట్‌ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌లోని నివాసితులను ఇళ్లు ఖాళీ చేయించారు. ఆ ప్రాంతంలోకి ప్రజలు రాకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆంజనేయ నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం 50 గజాల స్థలంలోనే ఏడంతస్తుల వరకు పేకమేడల్లా భవనాలు నిర్మించారని అధికారులు తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించడంతో కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఈ ఘటనతో అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నట్లు స్పష్టమవుతోంది.





# SCSC @20 లోగో ఆవిష్కరణ

మొదటి పేజీ తరువాయి... మద్దతునిస్తూ, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నందుకు ఆయన ఎస్సీఎస్సీని అభినందించారు. తెలంగాణ ఉద్యమం, కోవిడ్-19 మహమ్మారి వంటి క్లిష్ట సమయాల్లో ఎస్సీఎస్సీ అందించిన సహకారాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో పోలీసులు, పరిశ్రమలు, ఇతర భాగస్వాముల మధ్య సన్నిహిత సమన్వయం భద్రత, కార్యాచరణ, సామాజిక సంబంధిత సవాళ్లను పరిష్కరించడంలో సహాయపడిందని ఆయన పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం సంవత్సరాలు గడిచేకొద్దీ, సమస్యలకు స్పందించడం నుండి, కొత్తగా ఎదురయ్యే సవాళ్లకు చురుకైన, ఆచరణాత్మక పరిష్కారాలను అభివృద్ధి చేసే స్థాయికి పరిణామం చెందిందని సీపీ అన్నారు. మరింత సురక్షితమైన, పటిష్టమైన సైబరాబాద్‌ను నిర్మించడానికి పోలీసులు, పరిశ్రమలు, సమాజం మధ్య నిరంతర సహకారం అవసరమని ఆయన నొక్కిచెప్పారు.

### ఎస్సీఎస్సీ ప్రస్థానం

ఎస్సీఎస్సీ మాజీ సెక్రటరీ జనరల్ డాక్టర్ కృష్ణ యెడుల, సంస్థ ప్రారంభ రోజులను, సైబరాబాద్ ఐటీ కారిడార్ అభివృద్ధిని గుర్తుచేసుకున్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగానికి సురక్షితమైన, భద్రమైన వాతావరణం కల్పించాల్సిన అవసరంపై పోలీసులు, పరిశ్రమల మధ్య జరిగిన చర్చల నుంచే ఎస్సీఎస్సీ (SCSC) ఆలోచన పుట్టిందని ఆయన అన్నారు. పరిశ్రమల ఆందోళనలు మరియు ప్రామాణిక కార్యాచరణ విధానాలపై జరిగిన విస్తృత సంప్రదింపులు, చర్చలు ఈ సంస్థకు పునాది వేయడానికి సహాయపడ్డాయని, ఇది 2006 ఆగస్టు 23న లాంఛనంగా రూపుదిద్దుకుందని ఆయన గుర్తుచేసుకున్నారు.

వివిధ భాగస్వాములను ఒకచోట చేర్చే బలమైన వేదికగా SCSC ఎదిగిందని, పరిశ్రమ మరియు సమాజం యొక్క మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఇది నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉందని ఆయన అన్నారు.

### SCSC @ 20 లోగో మరియు స్మారక పుస్తకం

SCSC @ 20 లోగోను ఆవిష్కరించడం మరియు "ఎనేబ్లింగ్ ఎంటర్‌ప్రైజ్ – 2 దశాబ్దాల SCSC" అనే స్మారక పుస్తకాన్ని విడుదల చేయడం ఈ కార్యక్రమంలో ఒక ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో SCSC, స్ట్రాటజిక్ రిలేషన్స్ డైరెక్టర్ నాన్సీ సాహు ఒక కళా ప్రదర్శన కూడా ఇచ్చారు.

### సమకాలీన సవాళ్లపై నాలుగు ప్యానెల్ చర్చలు

ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో భద్రత, సైబర్ సెక్యూరిటీ, రహదారి భద్రత మరియు సామాజిక ఆరోగ్యం వంటి కీలక అంశాలపై దృష్టి సారించిన నాలుగు ప్యానెల్ చర్చలు జరిగాయి. "సురక్షితంగా ఉండటం అంటే ఏమిటి? – మహిళలు, పిల్లలు మరియు రాబోయే తరానికి సురక్షితమైన ప్రదేశాలను సృష్టించడం" అనే మొదటి ప్యానెల్‌కు మన తెలంగాణ సంపాదకులు దేవలపల్లి అమర్ మోడరేటర్‌గా వ్యవహరించారు. ఈ చర్చ మహిళలు మరియు పిల్లల భద్రత, అవగాహన, సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా ఉపయోగించడం మరియు భద్రతను ఒక జీవన నైపుణ్యంగా మార్చుకోవాల్సిన మిగతా 3లో ..









### తెలంగాణలో విద్యార్థులకు ఏటా రూ.12,000..

# దరఖాస్తుకు నేడే చివరి తేదీ!

తెలంగాణలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించే 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్' (NMMS) పథకం 2026-27 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల గడువు సమీపిస్తోంది. అర్హులైన విద్యార్థులు ఆగస్టు 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులు 8వ తరగతి తర్వాత చదువును మధ్యలో ఆపకుండా ప్రోత్సహించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం.

ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.1,000 చొప్పున, ఏడాదికి మొత్తం రూ.12,000 ఆర్థిక సహాయం అందుతుంది. ఈ సహాయం 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు, అంటే మొత్తం నాలుగేళ్ల పాటు కొనసాగుతుంది. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించని విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. విద్యార్థులు 7వ తరగతిలో కనీసం 55% మార్కులు సాధించి ఉండాలి (ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు 5% మినహాయింపు ఉంటుంది).

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ పరీక్షలో మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (MAT), స్కాలాస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (SAT) ఉంటాయి. అయితే, నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్లు, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పథకానికి అర్హులు కారు. స్కాలర్‌షిప్ కొనసాగాలంటే, విద్యార్థులు ప్రభుత్వ లేదా ఎయిడెడ్ పాఠశాలలు/కళాశాలల్లోనే చదువును కొనసాగించాల్సి ఉంటుంది.

దరఖాస్తుకు రేపే చివరి తేదీ కావడంతో, అర్హులైన విద్యార్థులు వెంటనే స్పందించాలని అధికారులు కోరుతున్నారు. పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు, దరఖాస్తు విధానం కోసం అధికారిక వెబ్‌సైట్ bse.telangana.gov.in ను సందర్శించవచ్చు.



# ఐఏఎస్ కన్నబాబు కుమారుడి వివాహ రిసెప్షన్

## వధూవరులను ఆశీర్వదించిన మంత్రి నారా లోకేష్

హైదరాబాద్, నవతరం: సీనియర్ ఐఏఎస్ అధికారి కె. కన్నబాబు కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌లోని వట్టినాగులపల్లిలో ఉన్న ఈవెంతారా కన్వెన్షన్‌లో కన్నబాబు కుమారుడు రితేష్ సూర్య ప్రీతమ్, హిమ ఐశ్వర్యల వివాహ రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు హాజరైన మంత్రి నారా లోకేశ్, వేదికపైకి వెళ్లి నూతన దంపతులను మనసారా ఆశీర్వదించారు. వారికి పుష్పగుచ్ఛం అందించి, ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం కన్నబాబు కుటుంబ సభ్యులతో మంత్రి లోకేశ్ కాసేపు ముచ్చటించారు. ఈ వివాహ వేడుకకు పలువురు రాజకీయ, అధికార ప్రముఖులు కూడా హాజరై వధూవరులను ఆశీర్వదించాకరు. మంత్రి నారా లోకేశ్ రాకతో వేడుక ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.









# సురేఖను ఈసారి కాపాడలేను

## టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్, నవతరం: తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత వ్యాఖ్యల వివాదం మరింత ముదురుతోంది. ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో అవకాశం ఉన్నప్పుడు సురేఖను కాపాడానని, కానీ ఇప్పుడు ఆమెను కాపాడే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు పార్టీ లైన్ దాటాయని ఆయన స్పష్టం చేశారు.

నిజామాబాద్‌తో పాటు పలుచోట్ల మీడియాతో మాట్లాడిన మహేశ్ గౌడ్, సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి మాట్లాడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని, ఆమె ఇచ్చే వివరణను బట్టి తదుపరి చర్యలు ఉంటాయని వివరించారు.

ఈ వ్యాఖ్యలు పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా ఉన్నాయని, వీటిని ఉపేక్షించేది లేదని అన్నారు. మరోవైపు, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మల్లు రవి నేతృత్వంలో శనివారం గాంధీ భవన్‌లో సమావేశం జరిగింది. కొండా సురేఖ సమర్పించిన వివరణను కమిటీ పరిశీలించింది. కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమని సురేఖ చెప్పినప్పటికీ, కమిటీ దానితో ఏకీభవించలేదు. మంత్రిగా ఉన్న సురేఖ ఆ వ్యాఖ్యలను ఖండించకపోవడం తప్పని అభిప్రాయపడింది. అయితే, తుది నిర్ణయం తీసుకోకుండా మరిన్ని సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది.

ఇదే సమయంలో, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీ లైన్ దాటలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేయడం గమనార్హం. కేవలం సురేఖ కుమార్తె వ్యాఖ్యలపైనే పార్టీ తీవ్రంగా దృష్టి సారించినట్లు ఆయన మాటల ద్వారా వెల్లడైంది.




# డీవైఎఫ్ఐ చరిత్రలో తొలిసారి..

సీపీఎం అనుబంధ యువజన విభాగం 'డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' (డీవైఎఫ్ఐ) కేరళ విభాగం చరిత్రలో నూతన అధ్యాయం ఆవిష్కృతమైంది. సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలిగా తొలిసారి ఒక మహిళా నేత ఎన్నికయ్యారు. త్రిశూర్‌లో జరిగిన 16వ రాష్ట్ర మహాసభలో చింతా జెరోమ్‌ను ఈ కీలక బాధ్యతలకు ఎంపిక చేశారు. ఈ విషయాన్ని డీవైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఏ.ఏ. రహీం అధికారికంగా ప్రకటించారు.

నూతన కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కల్లియాస్సేరి ఎమ్మెల్యే, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎం. విజిన్‌ను, కోశాధికారిగా ఆర్. రాహుల్‌ను నియమించారు. కొల్లాం జిల్లాకు చెందిన చింతా జెరోమ్.. ఎస్ఎఫ్ఐ ద్వారా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. కేరళ విశ్వవిద్యాలయం నుంచి ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ పొందిన ఆమె, ప్రస్తుతం డీవైఎఫ్ఐ కేంద్ర కమిటీతో పాటు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. గతంలో ఆమె డాక్టరేట్ థీసిస్, కొన్ని వ్యాఖ్యలపై వివాదాలు తలెత్తినప్పటికీ, పార్టీలో ఆమె ఎదుగుదల నిరంతరాయంగా సాగింది. మరోవైపు, తిరువనంత పురం మాజీ మేయర్ ఆర్య రాజేంద్రన్‌కు 25 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర సెక్రటేరియట్‌లో చోటు దక్కింది. ఆమె భర్త, గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే కే. సచిన్ దేవ్‌కు నూతన ఉపాధ్య క్షులలో ఒకరిగా అవకాశం కల్పించారు.



## SCSC @ 20 లోగో ఆవిష్కరణ

2వ పేజీ తరువాయి.. ప్రాముఖ్యతపై దృష్టి సారించింది. ఈ ప్యానెల్‌లో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. శ్రీజన, ఐఏఎస్; సైబరాబాద్ డీసీపీ ట్రాఫిక్ శేషాద్రిణి రెడ్డి, ఐపీఎస్; ఎస్సీఎస్సీ చిల్డ్రన్ & యూత్ సేఫ్టీ జాయింట్ సెక్రటరీ మరియు ఎలికో హెల్త్‌కేర్ సర్వీసెస్ లిమిటెడ్ వీసీ & ఎండీ డాక్టర్ వనితా దట్ల; మరియు లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ హెడ్ – పీపుల్ పార్టనరింగ్ తనుజ అబ్బూరి పాల్గొన్నారు. "డిజిటల్ ప్రపంచంలో ఎవరు సురక్షితంగా ఉన్నారు? – సైబర్ నేరాల నివారణ, భౌతిక & సామాజిక స్థితిస్థాపకతను బలోపేతం చేయడం" అనే రెండవ ప్యానెల్‌కు తెలంగాణ టుడే సంపాదకులు కె. శ్రీనివాస్ రెడ్డి మోడరేటర్‌గా వ్యవహరించారు. వేగంగా మారుతున్న సైబర్ నేరాల స్వరూపం, దర్యాప్తులలో డిజిటల్ ఆధారాల ప్రాముఖ్యత, సైబర్ మోసాలపై అవగాహన, అలాగే చట్ట అమలు సంస్థలు, సాంకేతిక నిపుణులు, సంస్థలు మరియు పౌరుల మధ్య బలమైన సహకారం అవసరాన్ని ఈ చర్చ ప్రముఖంగా ప్రస్తావించింది. ఈ ప్యానెల్‌లో ఎస్‌విపిఎన్‌పిఎ డిప్యూటీ డైరెక్టర్ డా. కల్మేస్వర్ షింగేనవర్, ఐపిఎస్; సైబరాబాద్, కూకట్‌పల్లి డిసిపి రితి రాజ్, ఐపిఎస్; మరియు జాయింట్ సెక్రటరీ రఘు కన్నన్ పాల్గొన్నారు. సైబర్ సెక్యూరిటీ – SCSC కార్యదర్శి మరియు సద్గురు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ వ్యవస్థాపకులు; అలాగే SCSC ఈసీ (EC) సభ్యులు మరియు TCS హైదరాబాద్ సెంటర్ హెడ్ అయిన నాగేశ్వరరావు చల్లా. మనం ప్రయాణించే విధానాన్ని మార్చుకోగలమా? – ప్రజలు, భాగస్వామ్యం మరియు సాంకేతికత ద్వారా సురక్షితమైన రహదారుల నిర్మాణం" అనే అంశంపై జరిగిన మూడవ ప్యానెల్ చర్చకు 'ది హిందూ' (తెలంగాణ) డిప్యూటీ ఎడిటర్ మర్రి రాము మోడరేటర్‌గా వ్యవహరించారు. ఈ ప్యానెల్‌లో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్ (IPS), SCSC ఈసీ సభ్యులు మరియు K రహేజా కార్పొరేషన్ COO శర్వాన్ కుమార్ గోనె, Topdriver Education LLP వ్యవస్థాపకులు నరేష్ రాఘవన్, మరియు ఆటోమొబైల్ డీలర్ వై. సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

# కన్నీళ్లు పెట్టించే మహారాష్ట్ర విషాదం..

## గంటలపాటు కుమారుడిని ప్రాధేయపడిన తల్లి

**శంభాజీనగర్, నవతరం:** మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో కుమారుడిని ఆత్మహత్య నుంచి కాపాడే ప్రయత్నంలో తల్లిదండ్రులు కూడా ప్రాణాలు కోల్పోయిన హృదయవిదారక ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఐఫోన్ ఈఎంఐ చెల్లింపునకు సంబంధించిన వివాదం ఆ కుటుంబంలోని ముగ్గురి ప్రాణాలను బలితీసుకుంది. తన కొడుకును ఆత్మహత్య చేసుకోవద్దని తల్లి ప్రాధేయపడటం, కాళ్లమీద కూర్చుని వేడుకోవడం వంటి దృశ్యాలు అందరినీ కలిచివేస్తున్నాయి.

ఝుల్తా గ్రామానికి చెందిన కునాల్ చంద్‌గుడే (19) అనే యువకుడు, ఐఫోన్ ఈఎంఐ చెల్లింపు విషయంలో తండ్రితో గొడవపడి, సమీపంలోని కొండపైకి వెళ్లి అంచున నిలబడ్డాడు. సమాచారం అందుకున్న తల్లి సంగీత గంటల తరబడి కొడుకును బతిమాలింది. నేలపై సాష్టాంగపడి, ఏ సమస్యనైనా పరిష్కరించుకుందామని, కిందకు రావాలని కన్నీటితో వేడుకుంది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గ్రామ సర్పంచ్ ఎంతగా నచ్చజెప్పినా కునాల్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు.

ఈ క్రమంలో తండ్రి మురళీధర్ తన కుమారుడిని అంచు నుంచి వెనక్కి లాగేందుకు ప్రయత్నించగా, ఇద్దరూ పట్టుతప్పి కొండపై నుంచి కింద పడిపోయారు. కళ్ల ముందే భర్త, కుమారుడు ప్రమాదానికి గురికావడంతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనైన సంగీత, కొద్ది క్షణాల్లోనే వారి వెనుకే దూకి ప్రాణాలు విడిచింది.

ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వెలుగులోకి వచ్చింది. నాలుగు నెలల క్రితమే ఈ కుటుంబం ఇక్కడికి వచ్చిందని, స్థానికులతో పెద్దగా పరిచయాలు లేవని గ్రామస్తులు తెలిపారు. వారు నివసించిన ఇంట్లో పెంపుడు కుక్క ఇప్పటికీ కిటికీలోంచి యజమానుల కోసం ఎదురుచూస్తుండటం అందరినీ కన్నీరు పెట్టిస్తోంది.



# సూత్రధారులను గుర్తించాలి: కొండా సురేఖ

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మరోసారి లేఖ రాశారు. కొందరు పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగా తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ఆమె ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారి వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ ఛైర్మన్ మల్లు రవిని ఆమె కోరారు.



కమిటీ పంపిన నోటీసుకు తాను ఇప్పటికే వివరణ ఇచ్చానని కొండా సురేఖ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఒక అంశంపై విచారణ కొనసాగుతున్న తరుణంలోనే, సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ఇతర నేతలు బహిరంగంగా విమర్శలు చేయడం సమంజసం కాదని, ఈ విషయాన్ని కమిటీ తీవ్రంగా పరిగణించాలని ఆమె తన లేఖలో పేర్కొన్నారు. కాగా, ఈ లేఖ రాయడానికి ముందు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ఈ అంశంపై స్పందించారు. కొండా సురేఖ సమర్పించిన వివరణపై కమిటీ ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలను ఒక బాధ్యతాయుతమైన మంత్రిగా సురేఖ ఖండించి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు.

సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఆ వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని కొండా సురేఖ వాదిస్తున్నట్లు మల్లు రవి పేర్కొన్నారు. ఇదే సమయంలో, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోతో పాటు ఆయన ఇచ్చిన వివరణను కూడా పరిశీలించినట్లు వెల్లడించారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, దీనిని సుమోటోగా స్వీకరించాలా? వద్దా? అనే అంశంపై యోచిస్తున్నామని ఆయన వివరించారు.

## రేవంత్‌కు క్షమాపణ చెప్పాల్సిందే

# కొండా సురేఖకు ఎమ్మెల్యేల అల్టిమేటం

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల వివాదం మరింత ముదిరింది. సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని, ఆమె సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని 20 మందికి పైగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులతో సీఎంపై విమర్శలు చేయించడం సంస్కార హీనమని, కూతురి వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ చెప్పడం కేవలం బుకాయింపు మాత్రమేనని వారు విమర్శించారు. ఇటీవల గీసుకొండలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డితో పాటు పార్టీ నాయకత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై టీపీసీసీ క్రమశిక్షణ సంఘం మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనికి సురేఖ వివరణ ఇస్తూ, తన కూతురి వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని, వాటికి రాజకీయంగా తాను బాధ్యత వహించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. తనపై జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు.

అయితే, సురేఖ వివరణపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ శాసనసభా పక్షం వేదికగా సమావేశమై, సురేఖపై మూకుమ్మడిగా విరుచుకుపడ్డారు. పార్టీ అంతర్గత విషయాలను బహిరంగంగా మాట్లాడటం సరికాదని, సురేఖ వెంటనే తన కుమార్తె వ్యాఖ్యలను ఖండించి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని డిమాండ్ చేశారు. సీనియర్ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా స్పందించారు. సుస్మిత వ్యాఖ్యలు పార్టీ నిబంధనలను అతిక్రమించాయని, దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామని స్పష్టం చేశారు. మరోవైపు, క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మల్లు రవి కూడా సుస్మిత వ్యాఖ్యలు అనుచితమని, మంత్రిగా ఉన్న సురేఖ వాటిని ఖండించకపోవడం తప్పని అన్నారు. శనివారం సమావేశమైన క్రమశిక్షణ కమిటీ.. సురేఖ వివరణ, వీడియో ఫుటేజీలను పరిశీలించి, తుది నిర్ణయం తీసుకోకుండా మరిన్ని సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది.

## ఇకపై ఓన్లీ బ్లాక్‌బస్టర్లే..

# సినిమా నిర్మాణంపై బండ్ల గణేశ్ కీలక ప్రకటన!

- పూర్తి దృష్టి సినిమా నిర్మాణంపైనేనని ప్రకటించిన బండ్ల గణేశ్
- ఇకపై కేవలం బ్లాక్‌బస్టర్ చిత్రాలే తీస్తానని స్పష్టీకరణ
- ఇతర విషయాలపై, రాజకీయాలపై ఆసక్తి లేదని తేల్చిచెప్పిన వైనం
- గబ్బర్ సింగ్, బాద్‌షా వంటి హిట్ చిత్రాల నిర్మాతగా గుర్తింపు
- ఇటీవలే 'బీజీ బ్లాక్‌బస్టర్స్' పేరుతో కొత్త బ్యానర్ ప్రారంభ

**హైదరాబాద్, నవతరం:** ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేశ్ మరోసారి పూర్తిస్థాయిలో చిత్ర నిర్మాణంపై దృష్టి సారించాడు. ఇకపై తన ప్రయాణం కేవలం సినిమాలతోనే ఉంటుందని, బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించడమే తన ఏకైక లక్ష్యమని ఆయన స్పష్టం చేశాడు. మరే ఇతర అంశాలతోనూ తనకు సంబంధం లేదని పేర్కొంటూ శనివారం సోషల్ మీడియా వేదికగా ఒక ఆసక్తికర సందేశాన్ని పోస్ట్ చేశాడు. "ఇక నా దృష్టి, నా నిర్ణయం, నా ప్రయాణం అంతా సినిమా నిర్మాణంపైనే. ప్రస్తుతం నాకు మరే ఇతర విషయాలతోనూ సంబంధం లేదు. కేవలం బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించాలనే గట్టి సంకల్పంతోనే ముందుకు సాగుతున్నాను. నా శ్రమ, సమయం, శక్తి అంతా ఇక సినిమాకే అంకితం" అని బండ్ల గణేశ్ తన పోస్టులో వెల్లడించాడు. మంచి సినిమాలు నిర్మించి, అఖండ విజయాలను అందుకోవడమే తన తదుపరి లక్ష్యమని ఆయన నొక్కిచెప్పాడు.

గతంలో బండ్ల గణేశ్ తన 'పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై పవన్ కల్యాణ్‌తో 'గబ్బర్ సింగ్', ఎన్టీఆర్‌తో 'బాద్‌షా', 'టెంపర్' వంటి భారీ విజయాలను అందుకున్నాడు. కొంతకాలంగా రాజకీయ పరమైన వ్యాఖ్యలతో నిరంతరం వార్తల్లో నిలుస్తున్న ఆయన, ఇటీవలే 'బీజీ బ్లాక్‌బస్టర్స్' (బండ్ల గణేష్ బ్లాక్‌బస్టర్స్) పేరుతో నూతన నిర్మాణ సంస్థను ప్రారంభించాడు.



# కాంగ్రెస్ ప్రభుత్వ '1,000 రోజుల ద్రోహం'పై ఎండగట్టేందుకు తెలంగాణలో నిరసనకు బీఆర్ఎస్ పిలుపు

**హైదరాబాద్, నవతరం:** హైదరాబాద్, ఆగస్టు 23: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా, ఆ ప్రభుత్వం ప్రజలకు చేసిన ద్రోహాన్ని ఎండగట్టేందుకు సెప్టెంబర్ 2 నుండి తెలంగాణ వ్యాప్తంగా వారం రోజుల పాటు ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు భారత్ రాష్ట్ర సమితి (BRS) ఆదివారం ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీలను నెరవేర్చడంలో విఫలమవ్వడం మరియు సమాజంలోని వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎత్తిచూపేలా BRS అనేక వినూత్న కార్యక్రమాలను చేపట్టనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం తన 1,000 రోజుల పాలనలో చేసిన వైఫల్యాలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ చేరవేసేలా పార్టీ శ్రేణులన్నీ ఏకతాటిపై నిలవాలని BRS వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు (KTR) పిలుపునిచ్చారు. 420 హామీలు, 13 ప్రకటనలు మరియు ఆరు గ్యారెంటీలతో సహా అనేక హామీలు ఇచ్చి, వాటిని 100 రోజుల్లోనే అమలు చేస్తామని నమ్మించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని KTR గుర్తు చేశారు. "అయితే, అధికారంలోకి వచ్చి 1,000 రోజులు గడిచినా, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చడంలో విఫలమైంది," అని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యాలు, అవినీతి మరియు దుష్పరిపాలన పట్ల తెలంగాణ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని KTR పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఎలా నిరాశపరిచిందో వివరించాలని, అలాగే ఆ ప్రభుత్వ విధానాలు, పరిపాలనా వైఫల్యాలు మరియు అక్రమాలను ప్రజలకు తెలియజేయాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. సెప్టెంబర్ 2 నుండి చేపట్టే కార్యక్రమాలు కేవలం కాంగ్రెస్ ఇచ్చిన హామీలకే పరిమితం కాకూడదని ఆయన అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చేసిన వైఫల్యాలను మరియు సమాజంలోని వివిధ వర్గాలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ఈ కార్యక్రమాలు ఎత్తిచూపాలని ఆయన సూచించారు.

వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలలో ఇంకా నెరవేరని అంశాలను "బాకీ కార్డుల" (Baaki Cards) ద్వారా ప్రజలకు తెలియజేయాలని KTR పిలుపునిచ్చారు; వాగ్దానం చేసినప్పటికీ ఇంకా అందజేయని ప్రయోజనాలు మరియు ఆర్థిక సహాయాన్ని ఈ కార్డులు హైలైట్ చేస్తాయి. వ్యవసాయ కూలీలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు మరియు యువతకు వాగ్దానం చేసిన నెలవారీ ఆర్థిక సహాయం కింద పేరుకుపోయిన బకాయిలను ఈ కార్డులు ప్రజలకు గుర్తుచేయాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల నుండి మహిళల వరకు అందరినీ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని KTR ఆరోపించారు. రూ. 12,000 కోట్లకు పైగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంలో



కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న విషయాన్ని అన్ని కళాశాలల్లోని విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని BRS పేర్కొంది. విద్యార్థులు మరియు వారి విద్యపై ఈ సమస్య చూపే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని, దీనిని ప్రతి కళాశాలకు తీసుకెళ్లాలని మరియు విస్తృత ప్రజా చర్చకు దారితీసేలా చూడాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, యువతకు ఉద్యోగాలు కల్పించడంలోనూ, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. ఆటో డ్రైవర్లు, మహిళలు, రైతులు, గిరిజనులు, దళితులు, వెనుకబడిన వర్గాలు, ప్రభుత్వ ఉద్యోగులు మరియు పదవీ విరమణ పొందిన ఉద్యోగులతో సహా కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చిన ప్రతి వర్గం కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని KTR పిలుపునిచ్చారు. సమాజంలోని ప్రతి వర్గాన్ని విడివిడిగా కలిసి, కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క వైఫల్యాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించాలని ఆయన సూచించారు. "కార్యక్రమాలు ఒకే రకమైన విధానంలో కాకుండా, ఆయా వర్గాలు ఎదుర్కొంటున్న నిర్దిష్ట సమస్యల ఆధారంగా రూపొందించబడాలి," అని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు యువతకు చేరేలా వినూత్న ప్రచారాలు మరియు కమ్యూనికేషన్ విధానాలను రూపొందించి, సోషల్ మీడియాను ఒక శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగించుకోవాలని ఆయన అన్నారు. ఈ వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో BRS ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేషన్ మరియు జిల్లా పరిషత్ ఛైర్మన్లతో పాటు అన్ని స్థాయిల నాయకులు పాల్గొనాలని KTR పిలుపునిచ్చారు.

## మద్యం రవాణా కుంభకోణంలో..
# ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 23 (నవతరం):** మద్యం కుంభకోణానికి సంబంధించిన రవాణా కుంభకోణం కేసులో ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) ఆదివారం అరెస్టు చేసింది. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఉన్న ఆయన నివాసం నుంచి ఈడీ అధికారులు ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. మద్యం రవాణా టెండర్లు మరియు ఆర్థిక లావాదేవీలలో జరిగినట్లు ఆరోపించబడుతున్న అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణ జరుపుతోంది. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు: వారు నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (APSBCL) మాజీ మేనేజింగ్ డైరెక్టర్ దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి మరియు రాజ్ కేశిరెడ్డి. నాగేశ్వరరావు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పౌర సరఫరాల శాఖ మంత్రిగా పనిచేశారు. జూన్‌లో సునీల్ కుమార్ అరెస్టు తర్వాత, మంత్రి కుమారుడిగా ఉంటూ తన వ్యాపార భాగస్వాములకు మద్యం రవాణా సబ్-కాంట్రాక్టులు దక్కేలా చేశారని ఈడీ ప్రత్యేక కోర్టుకు (PMLA) తెలిపింది. సునీల్ కుమార్ మరియు అతని సహచరులు చట్టవిరుద్ధంగా ఆర్థిక ప్రయోజనాలు పొందారని కోర్టుకు వివరించారు. ప్రభుత్వ ఖజానాకు రూ. 195.33 కోట్ల నష్టం వాటిల్లిందన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అదనపు కార్యదర్శి (విజిలెన్స్) ఫిర్యాదు ఆధారంగా, ఏపీ సీఐడీ (CID) నమోదు చేసిన ఎఫ్ఐఆర్ (IPC మరియు BNSలోని వివిధ సెక్షన్ల కింద) ఆధారంగా ఈడీ దర్యాప్తును ప్రారంభించింది. APSBCL మద్యం రవాణా టెండర్ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా మార్చి, సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (SSCSPL) మరియు తదనంతరం ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్స్ వంటి ఎంపిక చేసిన సంస్థలకు అనుకూలంగా రూపొందించారని ఈడీ దర్యాప్తులో తేలింది. ఇవి కేవలం నామమాత్రపు సంస్థలుగా (front entities) వ్యవహరించగా, వాస్తవ నిర్వహణ మరియు ఆర్థిక నియంత్రణ మాత్రం కేశిరెడ్డి, వాసుదేవ రెడ్డి మరియు వారి సహచరులకు సంబంధించిన వ్యక్తుల చేతుల్లోనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని డిపోల నుండి రిటైల్ అవుట్‌లెట్‌లకు మద్యం రవాణా ద్వారా చట్టవిరుద్ధమైన లాభాలను పొందేందుకు ఈ మద్యం సిండికేట్ ఒక విధానాన్ని రూపొందించినట్లు కూడా ఈడీ దర్యాప్తులో వెల్లడైంది.



కాగా, కారుమూరి నాగేశ్వరరావు అరెస్టును వైఎస్ఆర్‌సీపీ నేతలు, మాజీ మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, అనిల్ కుమార్ యాదవ్ మరియు విడదల రజని తీవ్రంగా ఖండించారు. ఇది టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేపట్టిన రాజకీయ కక్షసాధింపు చర్య అని వారు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని ఒక తప్పుడు కేసు బనాయించారని, మద్యం రవాణాలో అవకతవకల ఆరోపణలపై సీనియర్ బీసీ నాయకుడు కరుమూరిని హైదరాబాద్‌లో అన్యాయంగా అరెస్టు చేశారని వారు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. గతంలో ఆయన కుమారుడు సునీల్‌ను కూడా అరెస్టు చేశారని గుర్తుచేస్తూ, మొత్తం కుటుంబాన్ని ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని వారు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం కొనుగోలు, అమ్మకాలు పారదర్శకంగా జరిగాయని వారు తెలిపారు. అక్రమ మద్యంపై కఠోర శ్రమను అరికట్టామని, మద్యం దుకాణాల సంఖ్యను తగ్గించామని, చిల్లర దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించిందని వారు చెప్పారు. పర్మిట్ రూములు, బెల్ట్ షాపులను కూడా రద్దు చేశామని తెలిపారు.

### లిఫ్ట్‌లో ఇరుక్కుని బాలిక మృతి
# సత్తెనపల్లిలో విషాదం..

**పల్నాడు, నవతరం:** సత్తెనపల్లి పట్టణంలో విషాదం చోటుచేసుకుంది. ఆడుకోవడానికి పక్కింటికి వెళ్లిన ఓ బాలిక లిఫ్ట్‌లో ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన కొత్తపేట కాలనీలో జరిగింది. అయితే, ఇది కేవలం ప్రమాదం కాదని, తమ కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని తల్లిదండ్రులు ఆరోపించడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వివరాల్లోకి వెళితే.. కొత్తపేటకు చెందిన రేవతి (12) ఆదివారం సాయంత్రం పక్కింట్లో తన స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్లింది. అపార్ట్‌మెంట్‌లోని లిఫ్ట్ వద్ద ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు అందులో ఇరుక్కుపోయింది. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడి ఉన్న రేవతిని చూసిన స్థానికులు వెంటనే స్పందించినా, అప్పటికే బాలిక మృతి చెందింది. ఆడుకోవడానికి వెళ్లిన తమ కుమార్తె నిమిషాల వ్యవధిలోనే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఈ ఘటనపై మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేస్తూ, తమ కుమార్తె మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. కేవలం ప్రమాదవశాత్తు ఇలా జరగలేదని, దీని వెనుక వేరే కారణాలు ఉండవచ్చని ఆమె ఆరోపించారు. దీంతో ఈ ఘటనకు కొత్త కోణం తోడైంది. ఆ ఇంట్లో లిఫ్ట్ ను కొన్నిరోజుల కిందటే ఏర్పాటు చేశారు.

తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు రంగప్రవేశం చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, అనుమానాస్పద మృతి (సెక్షన్ 174 సీఆర్పీసీ) కింద కేసు నమోదు చేశారు. అపార్ట్‌మెంట్‌లోని సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. ప్రమాదం జరిగిన తీరుపై స్థానికులను, రేవతితో పాటు ఆడుకుంటున్న ఇతర పిల్లలను విచారిస్తున్నారు. ఇది కేవలం లిఫ్ట్ వైఫల్యం వల్ల జరిగిన ప్రమాదమా లేక దీని వెనుక మరేదైనా కుట్ర కోణం ఉందా అనే దిశగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.



# కారుమూరి అరెస్ట్..
### ప్రభుత్వ కక్షసాధింపు అంటూ విడదల రజని ఆగ్రహం

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును అక్రమంగా అరెస్టు చేశారంటూ ఆ పార్టీ నేత, మాజీ మంత్రి విడదల రజని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని, దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ అరాచకాలకు ఇది పరాకాష్ఠ అని ఆమె ఆరోపించారు. లేని కేసును సృష్టించి వైసీపీ నేతలను ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారని విమర్శిస్తూ తాడేపల్లిలో ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

గత ప్రభుత్వ హయాంలో మద్యం రవాణాలో అక్రమాలు జరిగాయనే నెపంతో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును హైదరాబాద్‌లో అక్రమంగా అరెస్టు చేశారని రజని పేర్కొన్నారు. బీసీ నేత అయిన కారుమూరి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని, కొద్ది రోజుల క్రితం ఆయన కుమారుడు సునీల్‌ను కూడా అరెస్టు చేశారని, ఇప్పుడు ఆయనను అరెస్టు చేయడాన్ని పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇద్దరు రిటైర్డ్ ఉన్నతాధికారులను కూడా అన్యాయంగా జైల్లో పెట్టారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం సరఫరా, విక్రయాలు పారదర్శకంగా జరిగాయని, దుకాణాల సంఖ్య తగ్గించడంతో పాటు అక్రమ మద్యాన్ని పూర్తిగా అరికట్టామని రజని స్పష్టం చేశారు. పర్మిట్ రూమ్‌లు, బెల్టు షాపులను నిర్మూలించామని గుర్తుచేశారు. అయితే, 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో మద్యం సరఫరా, విక్రయాల్లో భారీగా అక్రమాలు జరిగాయని ఆమె ఆరోపించారు. బార్ల యజమానులకు అనుకూలంగా వ్యవహరించి, ప్రివిలేజ్ ఫీజులు మాఫీ చేసి ఖజానాకు నష్టం కలిగించారని విమర్శించారు. అప్పట్లో మద్యం అమ్మకాలు పెరిగినా ప్రభుత్వ ఆదాయం పెరగలేదని, ఆ అవకతవకలపై చంద్రబాబుపై కేసు కూడా నమోదైందని తెలిపారు.

ఆ కేసు నుంచి బయటపడటానికే, తమ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలతో కేసులు బనాయించి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని రజని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కారుమూరి నాగేశ్వరరావును తక్షణమే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు.



Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism (NiMA) - Bureau Chief, Telangana, 9618907705,
E-mail: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://epaper.navatharam.com